ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి: బీజేపీ

అంబర్‌పేట: ప్రజాసమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధంగా ఉండాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు సూచించారు. శనివారం పార్టీ అంబర్‌పేట డివిజన్ కార్యవర్గ సమావేశం నగర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు నాగభూషణంచారి, నియోజకవర్గం కన్వీనర్ శ్యాంరాజ్, నాయకులు యాదగిరి, కృష్ణముదిరాజ్, యశ్వంత్, బిక్షపతి, నవీన్‌రెడ్డి, దయాకర్ యాదవ్, మహిలారం రాజు తదితరులు పాల్గొన్నారు.

యాదవులను తప్పుదోవ పట్టిస్తున్నారు..

- గడ్డం శ్రీనివాస్ యాదవ్‌పై లక్ష్మణ్ యాదవ్

కాచిగూడ: వంద సంవత్సరాల చరిత్ర గల అఖిల భారత యాదవ మహాసభ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటుండంగా మహాసభతో సంబంధంలేని గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఓ సంస్థ తరఫున అధ్యక్షుడు అయినట్లు ప్రకటించుకోవడంపట్ల అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధానకార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల రవీంద్రనాథ్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన కొంత మంది అఖిల భారత యాదవ మహాసభ పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసి మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను నియమించడం చట్టవ్యతిరేకమని అన్నారు. తెలంగాణలో సంఘటితంగా ఉన్న యాదవులను తప్పుదోవ పట్టించే విధంగా వాడుకుంటున్న అలాంటి వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

బడ్జెట్‌పై బ్రాహ్మణ సేవా సమితి హర్షం



నల్లకుంట: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో బ్రాహ్మణ సంక్షేమానికి రూ.50 కోట్లు, దేవాదాయ శాఖకు రూ.156 కోట్లు కేటాయించడంపట్ల తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు హర్షం వ్యక్తం చేశారు. కాగా, బ్రాహ్మణ పరిషత్‌కు మరో రూ. 50 కోట్లు కేటాయిస్తే మరింత బాగుండేది అభిప్రాయపడ్డారు. శనివారం నల్లకుంటలోని టీబీఎస్ఎస్ కార్యాలయంలో రమణారావు మాట్లాడారు. బ్రాహ్మణ ఉపాధి పథకం, వివేకానంద విద్యా పథకం ద్వారా 800 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారని, ఈ పథకం అమలుకు రూ.100 కోట్లు అవసరమవుతాయని తెలిపారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

కవాడిగూడ: ముషీరాబాద్ తహసీల్దార్‌గా కొర్రా రాణా ప్రతాప్ సింగ్ శనివారం మండల కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ముషీరాబాద్ తహసీల్దార్‌గా పనిచేసిన గోవర్ధన్ రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని నారాయణపేట తహసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్ బదిలీపై వచ్చారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లను త్వరితగతిన విచారణ జరిపి, దరఖాస్తుదారులకు అందేవిధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఆలయాల పరిసరాల్లో పారిశుధ్య చర్యలు

చిక్కడపల్లి: అమ్మవారి ఆలయాల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. ఇందులో భాగంగా శనివారం ఆలయాల నిర్వాహకులకు వ్యర్థాలను వేసేందుకు ప్రత్యేక కవర్లను అందజేసి మాట్లాడారు. బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్, ఆలయ నిర్వాహకులు సాయికీర్తి(బాబ్జి), భరత్, శివ, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహనను పెంపొందించుకొని అప్రమత్తంగా ఉండాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టీఎంబీ బుచ్చిబాబు సూచించారు. శనివారం అసోసియేషన్ ఫర్ ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రి సౌజన్యంతో ఆర్థోపెడిక్ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నీలాంజన్, మేనేజర్ రాహుల్ పటేల్, అసోసియేషన్ ప్రతినిధులు లెనిన్‌బాబు, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకురాలు అలివేలు మృతి



ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షురాలు, మాజీ వార్డు సభ్యురాలు అలివేలు(46) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ కార్పొరేటర్లు వి.శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల భాగ్యలక్ష్మి హరిబాబుయాదవ్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మోహన్‌నగర్‌లోని అలివేలు ఇంటికి వెళ్లి ఆమె భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అంత్యక్రియలు పార్శిగుట్టలోని శ్మశనవాటికలో నిర్వహించారు.

టిండేరు గోపాల్‌ను పరామర్శించిన దత్తాత్రేయ

చిక్కడపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టిండేరు గోపాల్‌ను హరియాణ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం చిక్కడపల్లిలోని నివాసంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టిండేరు శైలజ, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, పి.నర్సింగ్‌రావు, ఎస్.సత్తిరెడ్డి, దొనేటి సత్యం, లక్ష్మీనారాయణ, ఎం.రమేష్‌రామ్, సి.కే శంకర్, ఎస్.శ్రీనివాస్‌యాదవ్, పిఎస్.చారి తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్‌పై దాడి: ముగ్గురి అరెస్ట్

అంబర్‌పేట: ఆర్టీసీ బస్సు కండక్టర్‌పై దాడిచేసిన ఘటనలో ముగ్గురిని అంబర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం 113ఎం ఆర్టీసీ బస్సు మెహిదిపట్నం నుంచి ఉప్పల్ వైపు వెళ్తుండగా రామంతపూర్ రోడ్డులో ఇరానీ కేఫ్ బస్టాప్ వద్ద గణేష్, తులసి, రవి అనే వ్యక్తులు మద్యం మత్తులో బస్సు ఆపారు. కండక్టర్ మహేందర్‌తో గొడవకు దిగి చేయిచేసుకున్నారు. మహేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గుర్ని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'బడ్జెట్‌లలో దళిత, గిరిజనులకు అన్యాయం'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో దళిత, గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలు సామాజిక న్యాయాన్ని పాతర వేయడంలో ఒకటిగానే ఉన్నాయన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డబీఎఫ్, పీఎంసీ, కేవీపీఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. శంకర్ మాట్లాడుతూ దేశంలో 20 శాతం ఉన్న దళితులకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించలేదని విమర్శించారు.

బ్రిలియంట్ గ్రామర్ స్కూల్లో బోనాలు



కాచిగూడ: బోనాల వేడుకల సందర్భంగా శనివారం నారాయణగూడలోని బ్రిలియంట్ గ్రామర్ స్కూల్‌లో విద్యార్థినీవిద్యార్థులు బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో..



డీడీ కాలనీలోని నారాయణ పాఠశాలలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోనాల సంస్కృతిని చాటి చెప్పారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సవిత, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. - అంబర్‌పేట

మదర్ థెరిసా, కాకతీయ స్కూళ్లలో...



ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ కాకతీయ హైస్కూల్, రాంనగర్‌లోని మదర్ థెరిసా స్కూల్ విద్యార్థులు శనివారం వేర్వేరుగా బోనాల వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పూస రాజు, కె.వై.రావు, గోక నవీన్, బల్వంతరావు రామరాజు పాల్గొన్నారు.


చప్పల్ బజారు.. బోనాల జోరు!

ప్రత్యేకతను చాటుతున్న వేడుకలు
- సికింద్రాబాద్ మహంకాళి నుంచి ఊరేగింపుగా అమ్మవారి విగ్రహం
- 60 ఏళ్లుగా ఘనంగా నిర్వహణ

కాచిగూడ: అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలోని చప్పల్‌బజార్ బోనాల జాతరకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఘనంగా బోనాల వేడుకలు జరగనున్నాయి. ఆదివారం జరిగే ఈ జాతరకు ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ అమ్మవారి ఆలయం ఉండదు. ఏటా ఆషాఢ మాసంలో రెండు రోజులపాటు జరిగే బోనాల పండుగ సందర్భంగా సికింద్రాబాద్‌లో కొలువై వున్న మహంకాళి అమ్మవారి ఆలయం నుంచి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి చప్పల్‌బజార్‌లో ఏర్పాటు చేస్తారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఇక్కడ పూజలు చేయడం ఆనవాయితీ. గత 60 ఏళ్లుగా యంగ్ మెన్ అసోసియేషన్ వారు ఇక్కడ బోనాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని కూర్చోబెట్టడానికి ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దారు.



చప్పల్‌బజార్‌లో కొలువుతీరనున్న మహంకాళి అమ్మవారు



బోనాల పండుగ సందర్భంగా విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన స్వాగతతోరణాలు

విద్యుత్‌దీపాల తోరణాలు..

లింగంపల్లి చౌరస్తా నుంచి చప్పల్‌బజార్ లోని అమ్మవారి మండపం వరకు విద్యుత్ దీపాలతో స్వాగత తోరణాలను, వేదికలను ఏర్పాటు చేశారు. ఇప్పటి నుంచే ఆ రోడ్డు మొత్తం జాతర వాతావరణాన్ని తలపిస్తోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు లడ్డు యాదవ్, సి.వినోద్ యాదవ్, నందకిషోర్ యాదవ్ ఉత్సవ ఏర్పాట్లను విలేకరులకు వివరించారు. ఆదివారం సాయంత్రం ఫలహారం బండి ఊరేగింపు ఉంటుందన్నారు. 29న మధ్యాహ్నం పోతరాజుల ఊరేగింపు, ప్రముఖ జానపద కళాకారులతో జానపద గేయాలతో రథం ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ వేడుకల్లో ప్రతి ఏటా వేలాదిమంది భక్తులు పాల్గొంటారు. ఈసారి 10 వేలకుపైగానే భక్తులు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

హాజరుకానున్న సీఎం...

చెప్పల్‌బజార్‌లో జరిగే బోనాల వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను కలిసి ఆహ్వానిచ్చినట్లు యంగ్ మెన్ అసోసియేషన్ ప్రతినిధి సి.వినోద్ యాదవ్ తెలిపారు. సీఎం వీలుచూసుకుని బోనాల వేడుకలకు హాజరవుతానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

చప్పల్ బజారు బోనాల వేడుకలకు రండి..



సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సి.వినోద్ యాదవ్

నేడు వైభవంగా బోనాల వేడుకలు

అంబర్‌పేట: అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు బోనాల ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. అంబర్‌పేట మహంకాళి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులు అమ్మవారికి బోనం నైవేద్యంగా సమర్పించనున్నారు. మహంకాళి ఆలయంలో జరిగే వేడుకలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో పాటు పలువురు ప్రముఖులు దర్శించుకోనున్నారు. వివిధ విభాగాల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



మహంకాళి ఆలయంలో అమ్మవారు

నేడు అమ్మవారి బోనాలు

ముషీరాబాద్: ఆషాఢమాసంలో వైభవంగా నిర్వహించే బోనాలకు ముషీరాబాద్‌లోని అమ్మవారి దేవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ప్రసిద్ధిగాంచిన మహంకాళీ దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. తెల్లవారుజాము 4.30 నుంచి అమ్మవారికి అభిషేకాలతో పూజలు ప్రారంభమవుతున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి, దేవాదాయ శాఖ ఈవో సత్యనారాయణలు తెలిపారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, అనిల్‌కుమార్‌యాదవ్ హాజరవుతారని పేర్కొన్నారు.



విద్యుత్ దీపాలతో ముస్తాబైన ముషీరాబాద్ మహంకాళి ఆలయం

సైబర్ నేరాల నివారణపై అవగాహన అవసరం

కాచిగూడ: విద్యార్థులు సైబర్ నేరాల నివారణతోపాటు షీటీం సేవలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. శనివారం నారాయణగూడలోని రెడ్డి ఉమెన్స్ కాలేజీలో విద్యార్థులకు బాలల హక్కులు, షీ టీమ్, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, లింగ సమానత్వం, వివక్ష; సఖి సర్వీసెస్, చైల్డ్ లైన్ సేవలు, సైబర్ నేరాలు, పిల్లల అక్రమ రవాణా, మాదకద్రవ్యాల నివారణ, హెల్ప్ లైన్ నంబర్లు (1098, 100, 181, 112, 1930) పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్యుతదేవి, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: నేషనల్ సెంటర్ ఫర్ ఫైర్ సేఫ్టీ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీ, హెల్త్ సేఫ్టీ కోర్సులలో శిక్షణకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ ఫైర్‌సేఫ్టీ ఇంజినీరింగ్, ఫైర్ టెక్నాలజీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ, సబ్ ఫైర్ ఆఫీసర్, హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, డిప్లొమా ఇన్ ఫైర్ సేఫ్టీ ఇంజినీరింగ్ కోర్సులలో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్: 6302355872. వెబ్‌సైట్: www. nc-t-ti ndi-a.-c-om ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలపారు.

స్థిరమైన ఆర్థిక వ్యవస్థతోనే దేశాభివృద్ధి

కాచిగూడ: స్థిరమైన ఆర్థిక వ్యవస్థతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ వి.అప్పారావు అన్నారు. శనివారం కాచిగూడలోని బద్రుకా కామర్స్ కాలేజీలో 'స్థిరమైన ఆర్థిక వ్యవస్థ – పెట్టుబడులు– సవాళ్లు' అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సంజయ్ బయాని, ఓయూ కామర్స్ ప్రొ.గడ్డం నరేష్‌రెడ్డి, ఇంజినీరింగ్ కంట్రోలర్ సతీష్ కొత్తకోట, బద్రుకా కళాశాల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుకా, ప్రొఫెసర్ అభిరామకృష్ణ, డా.మోహన్ కుమార్, డా.జానకిరామ్ పాల్గొన్నారు.

పేదలకు కళ్యాణలక్ష్మి వరం: ఎమ్మెల్యే

కవాడిగూడ: పేదలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం వరం లాంటిందని దీనిని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో 212 షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్ హాజరై ముషీరాబాద్ తహసీల్దార్ కొర్రా రాణా ప్రతాప్‌సింగ్‌తో కలిసి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో 212మంది లబ్ధిదారులకు ఒకేసారి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు రావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ.లు కృష్ణ, సుభాష్, రవీందర్, మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లాను కలిసిన నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్

- జీతాలు పెంచేలా కృషి చేయాలని వినతి



ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నిమ్స్ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జీతాలు పెంచే విధంగా అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ శనివారం నిమ్స్ మెడికల్, హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. నిమ్స్ నుంచి నేరుగా వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వానికి సూచించాలని కోరారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నిమ్స్ ఆసుపత్రిలో కూడా సమానపనికి సమాన వేతనం చెల్లించేలా కృషి చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బీఆర్ఎస్ కార్మిక నేత జి.రాంబాబుయాదవ్, నిమ్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శిరందాస్ గోవర్ధన్ తదితరులున్నారు.

మంత్రికి వినతి

చిక్కడపల్లి: వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జె.సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన నివాసంలో కలసి వడ్డెర్ల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వడ్డెర్ల సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.



అంబేడ్కర్ కళాశాలలో బోనాల వేడుక



అంబేడ్కర్ కళాశాల బోనాల సంబరాల్లో పోతరాజుల విన్యాసాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బోనాల పండుగను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల లోకోలాహలంగా నిర్వహించారు. తెలంగాణ సంప్రదాయానికి చిహ్నమైన బోనాన్ని విద్యార్థులు, అధ్యాపకులు అమ్మవారికి సమర్పించారు. విద్యార్థులు పోతరాజుల వేషాలు వేసి విన్యాసాలు చేస్తూ కళాశాల ప్రాంగణంలో ఉత్సవాన్ని నింపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజా వివేక్ పాల్గొని అమ్మవారిని బోనాన్ని సమర్పించారు. గ్రామదేవతలైన ఎల్లమ్మ, పోచమ్మ, ముత్యాలమ్మలకు కుంకుమ, చీరసారెలు, బోనాల నైవేద్యాలతో మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎస్.రిషికాంత్, ప్రిన్సిపాల్ అధ్యాపకులు పాల్గొన్నారు.





సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383